


# వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వరద ప్రభావిత ప్రాంతవాసులు జాగ్రత్తలు తీసుకోవాలి
- శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరూ ఉండొద్దు
- కలెక్టర్ సత్య ప్రసాద్
- కోరుట్ల, మేడిపల్లిలో పర్యటన
- లోతట్టు ప్రాంతాల పరిశీలన


కోరుట్ల: ప్రకాశం రోడ్డులో వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాలటౌన్/ కోరుట్ల/ మేడిపల్లి, సెప్టెంబర్ 1: వరద ప్రభావిత ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. ఆదివారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన ప్రకాశం రోడ్డు, ఝూన్సీరోడ్డు కాలనీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మేడిపల్లి మండలం కొండాపూర్, బీమారం మండలం కమ్మరిపేట గ్రామంలోని చెరువులను పరిశీలించారు. ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటల వద్దకు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న నివాస గృహాల్లో ఉంటున్న ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తక్షణంగా స్పందించేలా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

### కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలి

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర సాయం కోసం ప్రజలు కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నంబర్ 180425 7620కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షానికి పాత ఇండ్లు కూలిపోయే అవకాశం ఉంటుందని, వాటిల్లో నివసించే వారు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ రాంబాబు, కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఆర్డీఏ రఘువరన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హిందూ సమాజం ఏకతాటిపై నడవాలి

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు
- వెల్లుల్ల శివారులో సామాజిక సమరసత సమ్మేళనం


మెట్‌పల్లి రూరల్: మాట్లాడుతున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 1: దేశంలో భిన్న కులాలున్నప్పటికీ హిందూ సమాజమంతా ఒకే కుటుంబమని, మనమంతా ఏకతాటిపై నడవాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని వీఆర్‌ఎం గార్డెన్స్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అహల్యా బాయ్ హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవాల సమ్మేళానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. భారత రాజ్యాంగంలో సోదరభావం అనే పదాన్ని చేర్చిన అంబేద్కర్ దేశ సమైక్యతకు ఆనాడే పునాది పలికారన్నారు. దేవాలయాలు, శ్మశానాలు, సహపంక్తి భోజనాల వద్ద ఎలాంటి భేద భావం చూపించవద్దని, భిన్న కులాలున్నప్పటికీ హిందువులంతా ఒకే కుటుంబంగా భావించాలని కోరారు. మహిళలు శుభకార్యాలు, పండుగలకు నిమ్నవర్గాల మహిళలను పిలిచి పసుపు, కుంకుమ సంప్రదాయంతో గౌరవించాలని భావించారు. ఆది శంకరాచర్యుల నుంచి నేటి వరకు ఎందరో మహానుభావులు సమరసత సమాజ నిర్మాణంలో కృషి చేశారని తెలిపారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ మాట్లాడుతూ పూర్వం నుంచి మన దేశంలో ఎలాంటి భేద భావన ఉండేది కాదని, మొగలులు, బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతనే సమాజంలో అంతరాలు పెరిగి, అంటరానితనం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రపంచంలో భారతదేశం ఉన్నతంగా నిలవడానికి కుటుంబ వ్యవస్థే మూలమని, దీనికి మహిళలే ఆధారమని తెలిపారు. మహిళలు తమ పిల్లలకు కుటుంబ విలువలు నేర్పాలని, కఠిన సందర్భాల్లో సైతం ధైర్యంగా నిలబడి సమస్యలను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆకుల నరేశ్‌బాబు, మహిళా విభాగం కన్వీనర్ రుక్మిణి, సమితి కన్వీనర్ మురళి, తుకారాం, శేఖర్, రాజేందర్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, రఘుపతి పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం


అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మారుతీనగర్, సెప్టెంబర్ 1: పట్టణంలోని మనోహర్ గార్డెన్స్‌లో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల 1970-71 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువు ఆనందరావును శాలువాతో సత్కరించి, అభినందించారు. ఆత్మీయ సమ్మేళనంలో రాజేశ్వర్‌గౌడ్, ఆల్‌రౌండర్ గంగాధర్, మాజీ ఎంపీటీసీ గాజెంగి రాజమల్లయ్య, విఠలాచారి, చంద్రశేఖర్‌రావు, వినోద్‌రావు, ప్రభాకర్‌రావు, మంత్రి అశోక్, రాజు, అంజయ్య, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

జగిత్యాల, సెప్టెంబర్ 1 : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ నెల 2న కలెక్టరేట్‌లో ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమైనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే సోమవారం యధావిధిగా కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు.

## వైభవంగా కుంకుమ పూజ

జగిత్యాల, సెప్టెంబర్ 1: జిల్లా కేంద్రంలోని పురాణిపేట లోకమాత (గాజుల) పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కుంకుమ పూజ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి హాజరై పూజలు చేశారు. కౌన్సిలర్ లలిత-మునీందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజేందర్ ఉన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేయాలి

- జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన
- నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన



జగిత్యాలలో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 1: సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ బోగ శశిధర్, సెక్రటరి జనరల్ గంగుల సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆదివారం అన్ని సంఘాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం నుంచి తహసీల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ తీశారు. నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి, టీజీవో జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, ట్రెసా అధ్యక్షులు ఎండీ వకీల్, కృష్ణ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనందరావు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రయ్య, ముజాహిద్ ఖాన్, సీపీఎస్‌ఈయూ అధ్యక్ష, కార్యదర్శులు గంగాధరి మహేశ్, సర్వ సతీశ్, గొల్లపెల్లి మహేశ్ గౌడ్, మ్యాన పవన్‌కుమార్, ఎంపీవోల సంఘం అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రవీందర్, జేఎల్ సంఘం అధ్యక్షుడు అత్తినేని శ్రీనివాస్, టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బోగ రమేశ్, కొక్కుల రాంచంద్రం, టీఆర్‌టీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు తుంగూరి సురేశ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, డీటీఎఫ్ అధ్యక్షుడు నరేందర్, ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు హరికిరణ్, మచ్చ శంకర్, బీటీఎఫ్ అధ్యక్షుడు శంకర్ బాబు, టీటీయూ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, నునావత్ రాజు, నాయకులు గణేశ్, సాహెద్ బాబు, రవీందర్, రాజేందర్, రాజేశం, మధుకర్, ప్రమోద్, మహమూద్, సురేందర్, సోహెల్, శ్రావణి, ఇంద్రజ, సుమేరా పర్వీన్, రాజేందర్ రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, వరప్రసాద్, ఆనంద్, పూర్ణచందర్, ఆనంద్, రాజ్‌కుమార్, నగేశ్, బేగ్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి, సెప్టెంబర్ 1: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆదివారం ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు గొడ్డలి పెట్టుగా మారిన నూతన పెన్షన్ విధానం ఆమోదయోగ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తిరుకోవెల శ్యామ్ సుందర్, గాదె నర్సింగ రావు, షేక్ తాహేర్, కల్లూరి నరేశ్, పిట్టల రాజేందర్, కిష్టయ్య, రాజు జాదవ్, తాడూరి యాదగిరి, రంగుల లక్ష్మీ నర్సయ్య, చిలువేరి రాజ్‌పాల్, రాజు, వేణు, గుంటుక సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 1: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పట్టణంలోని సంఘ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపెల్లి ప్రసాదరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, జిల్లా బాధ్యుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేయాలి

- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న మంత్రి

జగిత్యాల్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు పురాతన, శిథిల భవనాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. చెరువులు, ప్రాజెక్టుల కాలువల్లో నీటి నిల్వను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. చెరువులు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో హెడ్ క్వార్టర్‌లో ఉండి సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్వోసీ మంజూరు

కథలాపూర్, సెప్టెంబర్ 1: భూషణరావుపేటకు చెందిన బీ లక్ష్మికి రూ. 1.75 లక్షలు, కథలాపూర్‌కు చెందిన సీహెచ్ ముత్తయ్యకు రూ. 1.50 లక్షల విలువైన ఎల్వోసీ మంజూరైనట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు ఆదివారం చెప్పారు. ఎల్వోసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.